సూర్య
www.suryaa.com
ఎన్టీఆర్ - కృష్ణా
శుక్రవారం 29 నవంబర్ 2024 పేజీలు 8


# కేసుల్లో పురోగతి సాధించండి...



## బాధితులకు సత్వర న్యాయమందించే దిశగా ప్రణాళికల రూపొందించాలి

## అధికారులకు జిల్లా ఎస్పీ దిశా నిర్దేశం

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** గురువారం జిల్లా పోలీస్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్ అధికారులతో జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు నేర సమీక్ష సమావేశం నిర్వహించి పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. అందులో భాగంగా స్నేహపూర్వక పోలీసింగ్ ప్రజలకు అందిస్తూ, మహిళలు, చిన్నారుల భద్రతపై దృష్టి మిగతా 2లో...

## దళారులకు పంట అమ్మి

# నష్టపోవద్దు



- పంటను ప్రభుత్వానికి అమ్మి మద్దతు ధరను పొందండి..
- రైతుకు నచ్చిన మిల్లుకు ధాన్యం అమ్ముకోవచ్చు..
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

**పామర్రు నవంబరు 28 మేజర్ న్యూస్ :** రైతు కష్టపడి పండించిన పంటను ప్రభుత్వానికి విక్రయించి మద్దతు ధర పొందాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ రైతులను కోరారు. గురువారం మంత్రి కృష్ణా జిల్లా పర్యటనలో భాగంగా పామర్రు నియోజకవర్గంలోని స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజాతో కలసి కనుమూరు, కొండాయపాలెం, అడ్డాడ గ్రామాలలో పర్యటించి రైతులతో మాట్లాడారు. ధాన్యం రాశులను పరిశీలించి రైతుల ఇబ్బందులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఎంటియు 1262 వరి రకం పంటను మిల్లర్లు తీసుకోవడం లేదని కొంతమంది రైతులు మంత్రి దృష్టికి తీసుకురాగా, ప్రభుత్వం తప్పనిసరిగా అలాంటి రకం ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తుందని రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని మంత్రి భరోసా ఇచ్చారు. రైతులకు ఎలాంటి సమస్య ఉన్నా తనను ఫోన్లో నేరుగా సంప్రదించవచ్చని, 2



# వామ్మో, జుజ్జూరు రోడ్డా?

- గుంటలు పూడ్చారు.. దుమ్ము లేపారు...
- ప్రత్యక్ష నరకం చూస్తున్న ప్రజలు
- పట్టించుకోని ఆర్ అండ్ బీ అధికారులు, నాయకులు

**కంచికచర్ల నవంబర్ 28 మేజర్ న్యూస్ :** స్థానిక జుజ్జూర్ రోడ్డు ప్రజలకు ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తుంది.నెహ్రూ సెంటర్ నుండి వాటర్ ట్యాంకు వరకు కేవలం అర కిలోమీటర్ వరకు రోడ్డు అద్వానంగా తయారై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది.రోడ్డు పై ఏర్పడిన గుంటలకు ఎన్నిసార్లు అతుకులు వేసిన

మిగతా 2లో



# ముడా చైర్మన్‌గా మట్టా ప్రసాద్

- నగర అభివృద్ధిలో, పోర్టు అభివృద్ధిలో ముడా పాత్ర గణనీయం
- రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ముడా వైస్ చైర్మన్, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ సమక్షంలో ముడా చైర్మన్ బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఈ కార్యక్రమంలో పాల్గొని ముడా చైర్మన్ ను అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎంతో చరిత్ర గల మచిలీపట్నం నగర అభివృద్ధిలో, పోర్టు అభివృద్ధిలో ముడా పాత్ర గణనీయమైనదని, చేపట్టిన పదవి బాధ్యతగా నిర్వర్తించి ఈ ప్రాంత అభివృద్ధి కృషి చేయాలన్నారు. రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు ముడా చైర్మన్‌ను ప్రత్యేకంగా అభినందించి మాట్లాడుతూ బందరు పోర్టు కోసం ముడా ద్వారా భూములు సేకరించిన విషయం గుర్తు చేశారు. పోర్టు అభివృద్ధి ద్వారా జిల్లా రూపురేఖలే మారనున్నాయని, జిల్లా అభివృద్ధిలో ముడా ప్రధాన పాత్ర వహిస్తుందని అన్నారు. కైకలూరు శాసనసభ్యులు మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్, పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్, గుడివాడ శాసనసభ్యులు వెనిగండ్ల రాము, కూటమి పార్టీల రాష్ట్ర, జిల్లా నాయకులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, పలువురు ప్రజా ప్రతినిధులు ఈ మిగతా 2లో

(మొదటిపేజీ తరువాయి)

## ముడా చైర్మన్‌గా మట్టా ప్రసాద్






కార్యక్రమంలో పాల్గొని ముడా చైర్మన్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముడా చైర్మన్ మట్టా ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో కూటమి నాయకుల అండతో ముడా చైర్మన్ పదవికి వన్నె తెచ్చే విధంగా బాధ్యతగా పనిచేసి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తామని, బందరు పోర్టు అభివృద్ధి ద్వారా జిల్లా అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతామని అన్నారు. తన పదవి స్వీకార కార్యక్రమానికి హాజరైన మంత్రి పలువురు ప్రజాప్రతినిధులు కూటమి పార్టీల నాయకులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.

## వామ్మో జుజ్జూరు రోడ్డా?




తిరిగి యథా స్థానానికి చేరి పాదచారులు, వాహనదారులు వెళ్లలేని దుస్థితి నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లపాటు ఈ రోడ్ లో నరకయాతన పడ్డ ప్రజలు కూటమి ప్రభుత్వంలోనైనా బాగుపడుతుందేమో అని ఆశించారు. కానీ ఆశలు అడియాసలుగానే మిగిలిపోయాయి. మొన్నటిదాకా గుంటలు ప్రస్తుతం దుమ్ము దూళి తో ఇబ్బందులకు గురవుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాలను కలుపుతూ ఉన్న ఈ రోడ్డు నిత్యం వేలాది వాహనాలతో రద్దీగా ఉంటుంది. ఈ క్రమంలో పెద్ద వాహనాలు వెళ్లినప్పుడు ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారికి పాదచారులకు దుమ్ము దూళి కళ్ళల్లోపడి పరిస్థితి అయోమయంగా తయారవుతుంది. ఈ రోడ్డుకు ఇరుపక్కల ఉంటున్న వ్యాపారస్తులు, నివాసస్థులు నిరంతరం దుమ్ము దులుపుకుంటూనే ఉండాలి. లేకపోతే వస్తువులైన, మనుషులైనా రూపురేఖలు మారే పరిస్థితులు దాపురించాయి. దుమ్ము ధూళితో ఈ రోడ్లో నివాసం ఉండే వారి ఆరోగ్య పరిస్థితులు దారుణంగా మారాయి. సంవత్సరాల తరబడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా వారి గోడు పట్టించుకునే నాధుడు లేకపోవడం శోచనీయం. పల్లె పండుగ పేరుతో కూటమి ప్రభుత్వం గుంటలు పూడ్చినప్పటికీ అవి వర్షానికి తిరిగి యధాతధంగా మారాయి. గుంటలు పూడ్చారు కానీ దుమ్ము లేపారని ప్రజలు గొల్లుమంటున్నారు. గత ప్రభుత్వం హయాంలో ఈ రోడ్డును దత్తత తీసుకుంటామన్న వారు తక్షణమే ఈ రోడ్డు బాధ్యతలు చేపట్టాలని ప్రజలు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు.

**కొసమెరుపు :** అసలు ఆర్ అండ్ బి శాఖ ఉన్నట్టా లేనట్టా స్థానికులు చర్చించుకుంటున్నారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీ సాయి దీపోత్సవం



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని బందలాయిచెరువు శ్రీసాయి జ్ఞానమందిరం వద్ద గురువారం శ్రీసాయి దీపోత్సవం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువు అమ్ముల సాంబశివరావు ఆశీస్సులతో ఆలయ నిర్వాహకులురాలు సింహాద్రి లక్ష్మీ, సాయి సేవక్ కె ప్రియాంక ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన సాయిభక్తులు దీపాలు వెలిగించి హారతులిచ్చారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు సాయిబాబా గీతాలను ఆలపించారు. ఓం, శ్రీసాయి ఆకారంలో వెలిగించిన దీపాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

# దళారులకు పంట అమ్మి నష్టపోవద్దు



(మొదటిపేజీ తరువాయి)

తలెత్తిన సమస్యను అధికార యంత్రాంగంతో వెంటనే పరిష్కరింప చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం కల్పించిన కనీస మద్దతు ధర అందించేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని, రైతు నుంచి ప్రతి గింజ కొనుగోలు చేసి కూటమి ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని మంత్రి తెలిపారు. ధాన్యం కొనుగోలు అంశంలో రైతులకు అనుకూలంగా రాష్ట్ర ప్రభుత్వం కొన్ని సంస్కరణలను తీసుకొచ్చిందని తెలుపుతూ జిల్లా వ్యాప్తంగా రైతుకు నచ్చిన మిల్లుకు తమ ధాన్యం అమ్ముకోవచ్చన్నారు. అదేవిధంగా ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా గతంలో ఉన్న 17 తేమ శాతం నిబంధనను కొంతమేర సడలించామని, కేవలం ఐదు కేజీల తరుగుతో 24 శాతం వరకు తేమశాతం వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. వాహనాలకు జిపిఎస్ వ్యవస్థ లేకపోయినా లారీలు, ట్రాక్టర్ల ద్వారా ధాన్యం రవాణాకు అవకాశం కల్పించామని, దీని ద్వారా అవసరం మేరకు జిల్లా పరిధి దాటి కూడా వాహనాలను ఉపయోగించుకోవచ్చన్నారు. మిల్లర్లు సైతం చాలా మంది గతంలో బ్యాంకు గ్యారంటీ చెల్లించలేదని, వారికి 1:2 నిష్పత్తి పద్ధతిలో వెసులుబాటు కల్పించామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ సూచనల మేరకు ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగంగా ముందుకు తీసుకువెళుతున్నామని, 24 గంటల లోపే రైతులకు ధాన్యం నగదు వారి ఖాతాలకు చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర ఇవ్వకపోతే మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే అట్టి మిల్లులను మూసివేస్తామని మంత్రి హెచ్చరించారు. దళారులకు పంటను అమ్మి నష్టపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన వ్యవస్థ ద్వారా ధాన్యాన్ని విక్రయించుకుని మద్దతు ధర పొందాలని మంత్రి సూచించారు. గతంలో రైతు పండించిన ధాన్యం కోత కోసి నూర్పిడి వరకు 30 నుండి 40 రోజుల ప్రక్రియ ఉండేదని, ప్రస్తుతం మూడు రోజుల్లోనే ఈ ప్రక్రియ పూర్తికావస్తుండటంతో కొంచెం ఇబ్బందులు ఎదురవుతున్న మాట వాస్తవమే అన్నారు. అయినప్పటికీ తాను అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ 24 గంటలు ధాన్యం కొనుగోలు పైనే పనిచేస్తున్నామన్నారు. రైతులు కూడా కొంచెం ఓపికతో ఉండాలని, వారు పండించిన ప్రతి గింజను కొని రైతుకు అండగా ఉంటామని భరోసా ఇస్తున్నామన్నారు. ఈ పర్యటనలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఎన్. పద్మావతి, ఉయ్యూరు ఆర్డీఓ బివిఎస్ హేలా షారోన్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిణి వి. పార్వతి, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ డి.సృజన, జనసేన పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జ్ తాతిశెట్టి నరేష్, స్థానిక నాయకులు తదితరులు మంత్రి వెంట ఉన్నారు. ముందుగా తొలిసారి పామర్రు నియోజకవర్గానికి విచ్చేసిన మంత్రి నాదెండ్లను స్థానిక శాసనసభ్యులు కుమార్ రాజా శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

# కేసుల్లో పురోగతి సాధించండి...



(మొదటిపేజీ తరువాయి)



సారించాలని, అదేవిధంగా శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని తెలిపారు.

**క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్:** మహిళల, పిల్లల సంబంధిత నేరాల విషయంలో పోలీసులు వెంటనే ఎఫ్ఐఆర్ రిజిస్ట్రేషన్ చేయాలని త్వరితగతిన విచారణ పూర్తి చేసి కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేయాలని సూచించారు. అదేవిధంగా స్కూల్స్, కాలేజీలో అవేర్నెస్ క్యాంపులు కండక్ట్ చేయాలని, పిల్లలకు బ్యాడ్ టచ్, గుడ్ టచ్ గురించి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

**గంజాయి:** రాష్ట్ర ప్రభుత్వం గంజాయి నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందని ఆ కార్యాచరణ ప్రకారం జిల్లాని గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి అందరూ కృషి చేయాలని సూచించారు. గంజాయి కేసులకు సంబంధించి ఫార్వర్డ్ లింక్, బ్యాక్ వార్డ్ లింకు కనుగొని ముద్దాయిలను అరెస్ట్ చేయాలని సూచించారు. పెండింగ్లో ఉన్న ఎన్ డి పి ఎస్ కేసులలో విచారణ వేగవంతం చేయడానికి ప్రత్యేక టీములను ఏర్పాటు చేశారు. అలాగే నిర్జన ప్రదేశాలు, గంజాయి తాగడానికి ఎక్కువగా అవకాశం ఉండే ప్రాంతాలని గుర్తించి ఆ ప్రదేశాలలో పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు.

**దొంగతనాలు :** పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనాలు జరక్కుండా నైట్ బీట్ సంఖ్యను పెంచాలని అదేవిధంగా సిసిఎస్ టీమ్స్ కూడా వారు నైట్ బీట్ పెంచాలని సూచించారు. బీట్ తిరిగే కానిస్టేబుల్స్ వారి వారి ఏరియాల్లో సస్పెక్ట్ షీట్ హోల్డర్లు డి సి షీట్, కేడీషీట్ హోల్డర్ ని వెరిఫై చెయ్యాలని వారి కదలికలపై నిఘా పెంచాలని సూచించారు.

**ట్రాఫిక్ – రోడ్ యాక్సిడెంట్స్ :** రహదారి ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలి. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాలను గుర్తించి అక్కడ ప్రమాదాలు జరగకుండా సైన్ బోర్డ్స్, బారికేడ్స్ ఏర్పాటు చేయాలని, ప్రమాదాలు ఎక్కువగా జరిగే సమయాన్ని గుర్తించి ఆ సమయంలో విజిబుల్ పోలీసింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్స్ అయిన పెనమలూరు గన్నవరం గుడివాడ మచిలీపట్నం ట్రాఫిక్ పోలీస్ వారితో ప్రమాదాల నివారణకి ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. నిరంతరాయంగా వాహన తనిఖీలు చేపట్టాలి. వాహనదారులు తప్పనిసరిగా రహదారి భద్రత నియమాలు పాటించేలా చర్యలు చేపట్టాలి అని తెలిపారు.

**సైబర్ క్రైమ్ :** ప్రస్తుతం సైబర్ క్రైమ్స్ ఎక్కువగా జరుగుతున్నందున జిల్లాలో దీని కొరకు ప్రత్యేక సైబర్ క్రైమ్ టీం ఏర్పాటు చేశారు. సైబర్ క్రైమ్ నివారణకు చర్యలు తీసుకోవాలని, పెండింగ్లో ఉన్న సైబర్ క్రైమ్ కేసుల విచారణను త్వరగా ముగించాలని చెప్పారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయో గించి దర్యాప్తు అధికారులు నేరస్తులను గుర్తించి అరెస్టు చేయాలి. సైబర్ క్రైమ్ గురించి ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలియజేశారు.

**అండర్ ఇన్వెస్టిగేషన్ కేసెస్ :** విచారణ ఇంకా పూర్తికాని కేసులలో విచారణను వేగవంతం చేయాలని, విచారణ ముగించిన కేసులలో ఛార్జ్ షీట్ త్వరితగతిన వేసి కోర్టు అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన ట్రైల్స్ కి వచ్చేలా చేయాలని అధికారులకు ప్రత్యేకంగా సూచించారు.

**గ్రామాల సందర్శన :** పోలీస్ అధికారులు అందరూ తమ తమ పరిధిలో కమ్యూనల్, పొలిటికల్ సెన్సిటివ్ ఉన్న గ్రామాలను సందర్శించి అక్కడ ఎటువంటి శాంతి భద్రతల సమస్య ఎదురుకాకుండా తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. తరచూ నేరాలు జరిగే ప్రాంతాలను గుర్తించి అలాంటి ప్రాంతాలలో పోలీసు అధికారులు విసిబుల్ పోలీసింగ్ ను పెంచి ముందస్తుగానే నేరాలను నియంత్రించాలి.

పోలీస్ స్టేషన్ కి వచ్చే ఫిర్యాదు దారులతో స్నేహపూర్వకంగా మెలుగుతూ వారి సమస్యలను సామరస్యంగా విని చట్టపరిధిలో న్యాయం అందించే దిశగా కృషి చేస్తూ ప్రజలకు పోలీస్ శాఖపై మరింత నమ్మకాన్ని పెంపొందించాలి. తదుపరి జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులను గూర్చి సమీక్షించి కేసుల దర్యాప్తు వివరాలు చార్జ్ షీట్ దాఖలు, ప్రస్తుతం కోర్టులో ట్రైల్ ఏ దశలో ఉన్నాయి వంటి వివరాలను అడిగి తెలుసుకుని సంబంధిత సీడీ ఫైల్స్ ను క్షుణ్ణంగా పరి శీలించారు. కోర్టులో స్పీడ్ ట్రయల్ ద్వారా కేసులోని నిందితులకు తగిన శిక్ష పడేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

హత్య, రేప్ కేసులు, ఫోక్సో, ప్రాపర్టీ, గంజాయి, ఎస్సీ ఎస్టీ, గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల్లో దర్యాప్తు ముద్దాయిల అరెస్టు మొదలైన అంశాలు గూర్చి ఆరా తీసి, అపరిష్కృతంగా ఉన్న కేసుల్లో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్‌తో పురోగతి సాధించాలని, టెక్నాలజీని ఉపయోగించు కొని పెరుగుతున్న సైబర్ నేరాలను నియంత్రించే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్లో లాస్ట్ ప్రాపర్టీ కి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఎస్పీ మాట్లాడుతూ యూనిఫామ్ సర్వీస్ నిర్వహించే ప్రతి సిబ్బంది ఎంతో నియమ నిబంధనలతో విధులు నిర్వర్తించాలని, సిబ్బంది యొక్క ప్రవర్తన సరిగా లేకుంటే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడానికి ఏమాత్రం వెనకాడబోమని తెలిపారు. కృష్ణాజిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకువచ్చేలా ప్రతి ఒక్కరు నడుచుకోవాలని, పోలీస్ స్టేషన్ ను ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచుకుంటూ, హార్డ్ వర్క్, స్మార్ట్ వర్క్ చేయాలని, ప్రతిరోజు అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులలో ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించి కేసులు పురోగతికి పాటుపడాలని తెలిపారు. పోలీస్ స్టేషన్లో నిర్వర్తించే ప్రతి రికార్డ్ ను సక్రమంగా నిర్వర్తించాలని ఎప్పటికప్పుడు రికార్డ్స్ అప్డేట్ చేసుకోవాలని తెలిపారు. మరి ముఖ్యంగా మహిళల, చిన్నారుల మిస్సింగ్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ కనపరుస్తూ, వారి యొక్క వివరాలను తెలుసుకోవాలని సూచించారు.

# ఆంధ్రప్రదేశ్‌లో 'బాల్ వివాహ ముక్త్ భారత్' ప్రచారానికి భారీమద్దతు






**విజయవాడ, మేజర్ న్యూస్ :** భారత ప్రభుత్వం యొక్క బాల్ వివాహ ముక్త్ భారత్ ప్రచారానికి తమ అఖండ మద్దతును తెలియజేస్తూ, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జెఆర్‌సి) కూటమి నిర్వహించిన కార్యక్రమాలలో పాల్గొనడానికి వేలాది మంది ప్రజలు ఆంధ్ర ప్రదేశ్ అంతటా వీధులు, పాఠశాలలు, రోడ్లు, మార్కెట్‌లలో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లోని 2350 గ్రామాల్లో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాలు, క్యాండిల్‌లైట్‌లు, రోడ్‌షోలు జరిగాయి. ఒక సామాజిక ప్రయోజనం కోసం అపూర్వమైన సంఘీభావ ప్రదర్శనలో, పోలీసు స్టేషన్లు, కోర్టు గదులు, పంచాయితీ సభ్యులు, నాయకులు, పాఠశాల పిల్లలు, ఉపాధ్యాయులు, పిల్లలు, బాల్య వివాహాల నుండి బయటపడినవారు బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రతిజ్ఞ చేశారు. దేశంలోని 400 జిల్లాల్లో 250కి పైగా ఎన్‌జీవోల భాగస్వాములను కలిగి ఉన్న జెఆర్‌సి కూటమి బాల్య వివాహాలను నిర్మూలించడానికి రాష్ట్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్‌లోని 26 జిల్లాల్లో స్థానిక పరిపాలనతో కలిసి పని చేస్తోంది. జెఆర్‌సి భాగస్వాములు చట్టపరమైన జోక్యాల ద్వారా భారతదేశం అంతటా ఇప్పటికే చాలా చోట్ల బాల్య వివాహాలను నిరోధించారు. కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణా దేవి బాల వివాహ ముక్త్ భారత్ ప్రచారాన్ని నవంబరు 27న న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ప్రారంభిం చారు. బాల్య వివాహాలను అంతం చేసే బాధ్యతను తోటి పౌరులకు అందించా లని పిలుపునిచ్చారు. దేశంలోని అన్ని గ్రామ పంచాయతీలు, పాఠశాలల్లో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ఆమె ప్రతిజ్ఞ చేయించారు. ప్రచారం 25 కోట్ల మందికి చేరువయ్యే అవకాశం ఉంది. ప్రారంభోత్సవం సందర్భంగా బాల్య వివాహాలను నివేదించడం కోసం జాతీయ పోర్టల్‌ను కూడా ఆవిష్కరించారు. రాష్ట్రమంతటా జరిగిన కార్యక్రమాలలో పాల్గొన్న వారిచే "బాల్య వివాహాలకు వ్యతిరేకంగా సాధ్యమైన ప్రతి ప్రయత్నం చేస్తానని నేను ప్రతిజ్ఞ చేస్తున్నాను. నా కుటుంబం, పరిసరాలు లేదా సంఘంలో బాల్య వివాహాలు జరగకుండా చూసుకుంటానని నేను ప్రతిజ్ఞ చేస్తున్నాను. బాల్యవివాహాలు జరిగినప్పుడు పంచాయతీకి, ప్రభుత్వ అధికారులకు ఫిర్యాదు చేస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నాను", అని ప్రతిజ్ఞ చేయించారు. సాధారణంగా బాల్య వివాహ బాధితులు ఎటువంటి స్వేచ్ఛ లేకుండా హీనమైన బానిస జీవితాన్ని గడుపుతారు.

అంతేకాకుండా, శ్రామిక శక్తిలో మహిళలు పాల్గొనకపోవడానికి బాల్య వివాహాలు అతిపెద్ద కారణం. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 (ఎన్ఎఫ్ హెచ్ఎస్ 2019-21) జాతీయంగా 20-24 ఏళ్ల మధ్య వయసున్న 23.3% మంది మహిళలు 18 ఏళ్లు నిండకముందే పెళ్లి చేసుకున్నారని, ఇది ఆంధ్రప్రదేశ్‌లో 29.3 శాతం ఉందని నివేదించింది. "జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ కూటమిలోని 250 కంటే ఎక్కువ ఎన్‌జీవోలలో ఉన్న నా సహచరులు అవిశ్రాంత ప్రయత్నాలతో పాటు మిలియన్ల మంది బాలికలు, తల్లుల బాధ, స్థితిస్థాపకత మాకు ఈ చారిత్రాత్మక క్షణాన్ని తెచ్చిపెట్టాయి. మేము ముందుకు సాగుతున్నప్పుడు, నివారణ, రక్షణ, ప్రాసిక్యూషన్ సామరస్యంగా పని చేసే సంస్కృతిని పెంపొందించడానికి, ఒకదానికొకటి పూరకంగా, శాశ్వత ప్రవర్తనా మార్పును నడపడానికి భాగస్వామ్యాలను పెంచడానికి మేము రాష్ట్రంలోని ప్రభుత్వ సహకారం కోసం చూస్తాము" అని జెఆర్‌సి వ్యవస్థాపకుడు, భువన్ రిభు అన్నారు. రాబోయే నెలల్లో, జెఆర్‌సి సభ్యులు ఈ ప్రచారాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి జిల్లా, బ్లాక్, గ్రామంలోకి తీసుకెళ్లడానికి రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతునిస్తూ ఉంటారు.

## జాతీయ రహదారి పక్కన 'టీ' సేవించిన మంత్రి నాదెండ్ల



పామర్రు నవంబర్ 28 మేజర్ న్యూస్ : రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కృష్ణాజిల్లా పర్యటన లో భాగంగా తన తిరుగు ప్రయాణంలో పామర్రు వద్ద జాతీయ రహదారి పక్కన టీ టైమ్ దుకాణంలో కొద్దిసేపు ఆగి టీ సేవించారు. ఈ సందర్భంగా టీ దుకాణం వద్ద స్థానిక ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, గౌడ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, రాష్ట్ర వ్యవసాయ మిషన్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జి సాంబిరెడ్డి రాష్ట్ర తెలుగురైతు కార్యదర్శి సుబ్రహ్మణ్యం, చాగంటి తిమ్మారెడ్డి, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి తాడిశెట్టి నరేష్ తదితరులతో కొద్దిసేపు సంభాషించారు. వ్యవసాయానికి సంబంధించిన అంశాలతో పాటు రాష్ట్రంలో ప్రస్తుతం ప్రభుత్వం నడుస్తున్న తీరు తదితర విషయాలపై వీరంతా కొద్దిసేపు చర్చించారు.

## నిరుపేదలకు చేయూత నివ్వాలి




**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ఆర్థిక స్తోమత కలిగిన ప్రతి ఒక్కరు నిరుపేదలకు సహాయం చేయాలని శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాం కిషోర్ నాయుడు పిలుపునిచ్చారు. రానున్న చలికాలాన్ని దృష్టిలో పెట్టుకుని పంచాయతీ శివారు తిప్ప పాలెం చర్చ్ లో గురువారం 30 మంది నిరుపేద వృద్ధులకు దుప్పటి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్యాం కిషోర్ నాయుడు మాట్లాడుతూ నిరుపేదలైన వృద్ధులను ప్రతి ఒక్కరూ ఆదుకోవాలని కోరారు. ఆ కార్యక్రమములో పాస్టర్లు విలియం కేరి, సుకుమార్, సొసైటీ సభ్యులు తిప్ప పాలెం పెద్దలు పాల్గొన్నారు.

## రాజశేఖర స్వామి వారికి ప్రత్యేక పూజలు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ప్రాచీన శివాలయంగా పేరొందిన రాజరాజేశ్వరి సహిత రాజశేఖర స్వామి వారి దేవ స్థానములో స్వామి వారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. కార్తీక మాస ఉత్సవాలలో భాగంగా బహుళ త్రయోదశి గురువారాన్ని పురస్కరించుకుని రాజశేఖర స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఘంటసాల పవన్ సాయి కుమార్ వారికి వేదమంత్రాలతో నందీశ్వరుడుకి అభిషేక కార్యక్రమాలు ,స్వామి వారిని డ్రై ఫ్రూట్స్‌తో విశేషంగా అలంకరించారు. నందికి కూడా ప్రత్యేక పూజలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. భక్తులు విరివిగా విచ్చేసి లలిత సహస్ర నామ స్తోత్ర పారాయణం లింగాష్టకం స్వామూహికంగా పారాయణం చేసి స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు కావాల్సిన ఏర్పాటులను ఆలయ కార్య నిర్వాహణాధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు స్వయంగా పర్యవేక్షించారు.

## సాయి మందిరంలో అన్న సమారాధన



**అవనిగడ్డ. మేజర్ న్యూస్ :** కార్తీక మాసం చివరి గురువారాన్ని పురస్కరించుకుని కొత్తపేట రోడ్ లోని షిరిడి దివ్య సాయి మందిరంలో అన్న ప్రసాద వితరణ జరిగింది. సుమారు 3600 మంది భక్తులు. బాబా వారి అన్నప్రసాదాన్ని స్వీకరించి అలౌకిక ఆనందాన్ని పొందారు. ఆలయ ధర్మకర్త మండలి సత్య ప్రసాద్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు పడకడా, కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ రహదారి వెంట, ట్రాఫిక్ జామ్ అయ్యేటట్లు భక్తుల కోలాహలం అద్భుతంగా ఉందని ధర్మకర్త గ సంతోషాన్ని వ్యక్తం చేశారు.ఉదయం నుండి బాబా వారికి పంచామృతాలతో స్నాన మాచరింపజేసి, నూతన వస్త్రధారణ జరిపించారు. అనంతరం బాబా వారికి అత్యంత ప్రీతికరమైన విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు.

## గత ఐదేళ్లలో రూ. 3,330 కోట్ల పైచిలుకు క్లెయిమ్‌లను చెల్లించిన స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్



**విజయవాడ మేజర్ న్యూస్ :** భారత్‌లో అతి పెద్ద స్టాండెలోన్ రిటైల్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ అయిన స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్, దాదాపు 100 శాఖలు, 76 వేల మంది పైగా ఏజెంట్లు, 8.17 లక్షల మందికి కవరేజీ, 1,350 మంది ఉద్యోగులతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలో తన స్థానాన్ని పటిష్టం చేసుకుంది. వివిధ వర్గాలకు సమగ్రమైన, ఆరోగ్య సంరక్షణ సొల్యూషన్స్‌ను అందించాలన్న లక్ష్యంపై గల నిబద్ధతకు నిదర్శనంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో కంపెనీ గత ఐదేళ్లలో రూ.3,330 కోట్ల పైగా క్లెయిమ్‌లను చెల్లించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో వచ్చే నాలుగు సంవత్సరాల్లో తమ వ్యాపారాన్ని రెట్టింపు చేసుకోవాలని కంపెనీ లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో వైవిధ్యమైన ఆరోగ్య సంరక్షణ అవసరాలకు అనుగుణంగా సమగ్రమైన, సరళమైన బీమా సొల్యూషన్స్‌ను స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ అందిస్తోందని సంస్థ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ సనత్ కుమార్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## సీజన్ మారుతున్న వేళ కాలిఫోర్నియా ఆల్మండ్స్‌తో రోగనిరోధక శక్తి బలోపేతం



**విజయవాడ మేజర్ న్యూస్ :** కాలానుగుణ మార్పుల నేపథ్యంలో, రోగనిరోధక శక్తిని ప్రభావవంతంగా మెరుగుపరుచుకోవటానికి పోషకాహార నిపుణులు రితికా సమద్దర్ మీ దిన చర్యలో పోషకాలు అధికంగా ఉండే ఆహారాలను చేర్చుకోవా లని సిఫార్సు చేస్తున్నారు. అటువంటి సూపర్‌ఫుడ్‌లలో ఒకటి కాలిఫోర్నియా బాదం. వైవిధ్యమైనప్పటికీ, సంపూర్ణమైన ఆహారంగా బాదం పోషకాహారం యొక్క పవర్‌హౌస్‌గా నిలుస్తుంది. కాలిఫోర్నియా బాదంలో ప్రోటీన్, ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు వంటి 15 ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయి, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా బాదంపప్పును సహజంగా రోగనిరోధక శక్తిని పెంచడానికి ఒక ముఖ్యమైన ఆహారంగా గుర్తించింది. ఇటీవల ప్రచురించిన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మె డికల్ రీసెర్చ్ భారతీయుల కోసం ఆహార మార్గదర్శకాలు బాదంపప్పును మంచి ఆరోగ్యం కోసం ప్రతిరోజూ తినగలిగే పోషకమైన గింజగా గుర్తించాయి.

## ది రాయల్ ఎన్‌ఫీల్డ్ నుంచి గోవన్ క్లాసిక్ 350



**విజయవాడ మేజర్ న్యూస్ :** మిడ్-సైకిల్ మోటార్‌సైకిల్ విభాగంలో (250-750 సిసి) గ్లోబల్ లీడర్ అయిన రాయల్ ఎన్‌ఫీల్డ్, ఏడవ దశాబ్దం, 80ల లో ఐకానిక్ గోవా మోటో కల్చర్ నుంచి పొందిన ప్రేరణతో, గోవన్ క్లాసిక్ 350ని విడుదల చేసింది. బొబ్బర్ నుంచి పొందిన స్ఫూర్తితో తయారైన మోటారుసైకిల్‌గా, సంప్రదాయానికి అతీతంగా, స్వేచ్ఛాయుతమైన జీవనశైలిని జరుపుకుంటోంది. గోవన్ క్లాసిక్ 350 అనేది భారతదేశపు ప్రత్యేకమైన గోవా మోటో కల్చర్‌ను రూపొందించిన స్వీయ వ్యక్తీకరణ కాలిడోస్కోప్‌కు అనుకరణ. ఇది ఏడవ దశకం నుంచి ఎనిమిదవ దశకాలలో గోవాలో ఉద్భవించిన ఫ్రీవీలింగ్ కౌంటర్ కల్చర్ బిద్ధ ఫోర్ స్ట్రోక్.. ఎండలో మెరిసిపోయే హిప్పీ యంత్రం. ఇది ఎల్లప్పుడూ స్వీయ ఆవిష్కరణ, స్వీయ విముక్తి మార్గంలో ఉంటుంది..

## మద్యం సేవించి వాహనాలు నడిపిన 23 మంది వ్యక్తులుకు జరిమానా

**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్:** విజయవాడ నగరంలో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ఎన్.టి.ఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు వారి అదేశాల మేరకు నగరంలో వివిధ ప్రదేశాలలో మద్యం సేవించి వాహనములు నడిపే చోదకులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో ది.28-11-2024 వ తేదిన 2వ, 4వ ట్రాఫిక్ పోలీసు వారు మొత్తం 23 కేసులలో మద్యం సేవించి వాహనములు నడిపే చోదకులను సంబంధిత కోర్ట్ లో ప్రవేశపెట్టగా, గౌరవ న్యాయమూర్తి లెనిన్ బాబు 03 మందికి ఒక్కొక్కరికి రూ.15,000/- చొప్పున మిగిలిన 20 మందికి ఒక్కొక్కరికి రూ.10,000/- చొప్పున జరిమానా విధించారు. ప్రతి రోజు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించి పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుంది. కాబట్టి వాహన చోదకులు ట్రాఫిక్ నియమ నిబంధనలు, మోటార్ వాహన చట్టాలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణం చేయాలని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు తెలియజేశారు.

# కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కన్నుల పండువగా యంసీసీ క్రికెట్ టోర్నీ





## 8వ రోజు కూడా భారీగా తరలి వచ్చిన యువత

## ఇలాంటి క్రీడా పోటీలు మరిన్ని నిర్వహించాలంటున్న యువత



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యం సి సి క్రికెట్ టోర్నీ నిర్వహణపై యువత నుండి భారీ స్పందన వస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా మచిలీపట్నంలో క్రీడా పోటీలు నిర్వహించడం ద్వారా యువతలో క్రీడా స్ఫూర్తి పెరుగుతోందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. 8వ రోజు మొదటి మ్యాచ్ యంగ్ స్టార్స్, ఎబికె యూత్ మధ్య జరగగా మొదటి ఇన్నింగ్స్ వచ్చిన యంగ్ స్టార్స్ 9 ఓవర్లుకు 42 పరుగులు చేయగా 2వ ఇన్నింగ్స్ లో ఎబికె యూత్ 6 ఓవర్లలో 46 పరుగులు చేసి 5 వికెట్ల తేడాతో గెలుపొందారు. రెండో మ్యాచ్ మ్యాన్ టౌన్ పార్టీ అధ్యక్షులు ఇలియాస్ భాష వీక్షించడానికి వచ్చి టాస్ వేసి క్రికెట్ ప్లేయర్లకు శుభాకంక్షలు తెలిపారు. భాయ్ 11 వర్సెస్ స్మాష్ మధ్య జరిగింది. 1వ ఇన్నింగ్స్ బ్యాటింగ్ చేసిన భాయ్ 11 టీం 10 ఓవర్లలో 64 పగురులకు ఆల్ అవుట్ అవ్వగా రెండో ఇన్నింగ్స్ లో స్మాష్ వారు 7.1 ఓవర్లలో 65 పరుగులు చేసి విజయం 8 వికెట్లుతో విజయం సాధించారు. ఈ క్రికెట్ టోర్నమెంట్లు లో తెలుగు యువత అధ్యక్షులు సలీం, రాణా తదితరులు పాల్గొన్నారు. మూడో మ్యాచ్ స్పార్ట్ టీమ్ వర్సెస్ స్టార్ లెవెన్ మధ్య జరిగింది. స్టార్ లెవన్ టీం 46 పరుగులతో విజయం సాధించింది.



## పాలేటి, చిరుమామిళ్ల వివాహ నిశ్చితార్థ వేడుక

**నందిగామ, నవంబర్ 28, మేజర్ న్యూస్ :** పట్టణంలోని సిగ్నేచర్ టవర్స్‌లో నందిగామ చెందిన చిరుమామిళ్ల సత్యనారాయణ ప్రసాద్ కుమారుడు చిరుమామిళ్ల వంశీ, ప్రముఖ కాంట్రాక్టర్ పాలేటి సతీష్ కుమార్తె పాలేటి నవ్య వివాహ నిశ్చితార్థ వేడుకలు బుధవారం నందిగామ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. సాంప్రదాయ బద్ధంగా తెలుగుతనం ఉట్టిపడేలా ఏర్పాట్లు నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు వసంత కృష్ణప్రసాదు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పట్టణ ప్రముఖులు తదితరులు కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించి, వారికి, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలేటి, చిరుమామిళ్ల కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్ తనిఖీ చేసిన కలెక్టర్ డీ కే బాలాజీ



**మచిలీపట్నం, మేజర్ న్యూస్ :** జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ గురువారం కలెక్టరేట్ ఆవరణలో ఈవీఎం గోడౌన్ తనిఖీ చేశారు. ఈవీఎం గోడౌన్లకు వేసిన తాళాలు, సీళ్లు పరిశీలించారు. ఈవీఎం గోడౌన్ వద్ద సెక్యూరిటీ, సీసీ కెమెరాలు పర్యవేక్షణ పటిష్టంగా ఉండాలన్నారు. తనిఖీ రిజిస్టరులో సంతకం చేసారు. భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నెలవారి తనిఖీల్లో భాగంగా ఈవీఎం గోడౌన్ తనిఖీ చేసి నివేదిక పంపవలసి ఉంటుంది. ఈ మేరకు కలెక్టర్ ఈవీఎం గోడౌన్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## వైయస్ఆర్సీపీ కార్యాలయంలో పూలే వర్ధంతి వేడుకలు



**పామర్రు నవంబర్ 28 మేజర్ న్యూస్ :** మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకొని పామర్రులోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. పామర్రు మండల పరిషత్ అధ్యక్షుడు దాసరి అశోక్ కుమార్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఆరేపల్లి శ్రీనివాసరావు లు జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గురుమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా పూలే వర్ధంతి



**పామర్రు నవంబర్ 28 మేజర్ న్యూస్ :** మంగళగిరి తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో మహాత్మ జ్యోతిరావు పూలే 129 వ వర్ధంతి ఆంధ్రప్రదేశ్ గౌడ అభివృద్ధి సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వినుకొండ నియోజకవర్గ శాసనసభ్యులు జివి ఆంజనేయులు, ఎమ్మెల్సీ అశోక్ బాబు, భవన నిర్మాణ కార్మికుల కార్పొరేషన్ చైర్మన్ గొట్టిముక్కల రఘురామరాజు, పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, తిరుమల తిరుపతి దేవస్థాన బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ బి.సి సెల్ ఉపాధ్యక్షులు పూతి కోటేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ కార్యాలయ రిసెప్షన్ ఇంచార్జ్ హాజ్ హాసనా భాషా, ఎన్ఆర్ఈజీఎస్ మాజీ డైరెక్టర్ పీరయ్య తదితర ముఖ్య నాయకులు పాల్గొని జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

## వైసీపీకి శెట్టపల్లి వెంకటేశ్వరరావు రాజీనామా



**రెడ్డిగూడెం, నవంబర్ 28, మేజర్ న్యూస్ :** మండల పరిధిలో గల అన్నేరావుపేట గ్రామానికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, గ్రామ పార్టీ వైఎస్ఆర్సిపి కన్వీనర్, మాజీ సర్పంచ్ శెట్టపల్లి వెంకటేశ్వరరావు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు గురువారం విలేకరుల సమావేశంలో ప్రకటించారు. ఈ మేరకు ఆయన తన రాజీనామా లేఖను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బలగాని తిరుపతిరావు కు పంపినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై త్వరలో తెలుగుదేశం పార్టీలోకి చారబోతున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో తమ గ్రామానికి మంజూరైన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణాన్ని వైసీపీ లో అధికారం చెలాయించిన మండల స్థాయి నాయకులు అడ్డుకున్నారనీ ఇలాంటి వారి వలన మా ప్రాంతం అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. తమకు గ్రామ అభివృద్ధి అవసరం అని అన్నారు.

## మట్టా ప్రసాద్ ప్రమాణ స్వీకారానికి తరలి వెళ్లిన బీజేపీ నేతలు



**కోడూరు మేజర్ న్యూస్:** మచిలీపట్నం అర్బన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా బాధ్యతలు చేపడుతున్న మట్టా ప్రసాద్ ప్రమాణ స్వీకారానికి భారతీయ జనతా పార్టీ నేతలు తరలివెళ్లారు. భాజపా అవనిగడ్డ నియోజకవర్గ కో కన్వీనర్ తుంగల వెంకటగిరి, బీజేపీ పార్టీ కృష్ణాజిల్లా ఆర్టిఐ కన్వీనర్ కొండవీటి రామకృష్ణ, కోడూరు, అవనిగడ్డ, నాగాయలంక మండలాల భాజపా అధ్యక్షులు వడుగు నాగబాబు, బచ్చు విజయలక్ష్మి, కన్నా వెంకటేశ్వర రావు (నాని) పార్టీ నేతలు బండే ఆంజనేయులు, కోట సత్యనారాయణ, దేవరకొండ సుబ్బారావు, కొండవీటి సుబ్రహ్మణ్యం, పేర్ని బాబురావు తరలివెళ్ళారు.

## అచ్చంపాలెంలో వృద్ధురాలికి గ్యాస్ స్టౌవ్, సిలిండర్ వితరణ



**ఘంటసాల, మేజర్ న్యూస్:** మండల పరిధిలోని అచ్చంపాలెం గ్రామానికి చెందిన వృద్ధురాలు నంద్యాల సీతమ్మకు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదేశాల మేరకు, అచ్చంపాలెం సర్పంచ్ గాజుల శ్రీనివాసరావు, తెలుగు యువత రాష్ట్ర నాయకులు, ఎంపీటీసీ సభ్యులు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా) కలిసి గ్యాస్ స్టౌవ్, సిలిండర్‌ను గురువారం అందజేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధురాలు నంద్యాల సీతమ్మ వంట పనులు చేసు కోవడంలో ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, తక్షణమే స్పందించి ఆమె ఇంటికి గ్యాస్ కనెక్షన్ ఇప్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం, అచ్చంపాలెం ప్రాంతానికి చెందిన కూటమి నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## తమిరిశ సర్పంచ్ ఎస్సీ కులధ్రువీకరణపై రేపు విచారణ

**నందివాడ,మేజర్ న్యూస్:** మండల పరిధిలోని తమిరిశ గ్రామ సర్పంచ్ తప్పిట ధనలక్ష్మి కుల ధ్రువీకరణ పై శుక్రవారం విచారణ నిర్వహించనున్నట్లు ఈఓపిఆర్డీ భాష వెల్లడించారు. 2020\2021 సాధారణ ఎన్నికల్లో తమిరిశ సర్పంచ్‌గా ఎస్సీ మహిళకు రిజర్వ్ చేశారు. వై కాపా మద్దతుతో ధనలక్ష్మి పోటీచేసి గెలిచారు. ఆమె తప్పుడు కుల ధ్రువీకరణ పత్రం సమర్పించారని ప్రత్యర్థి అభ్యర్థి కారే వెంకట రమణ పంచాయతీ రాజ్ డైరెక్టర్ కు ఫిర్యాదు చేశారు. క్రిస్టియన్ సమాజక వర్గానికి చెందిన ఆమె తన పాఠశాల టీసి లో బీసీసి గా నమోదు చేయించు కొని ఎన్నికల సమయంలో హిందూ -మాల (ఎస్సి )గా తాసిల్దార్ కార్యాలయం నుంచి కుల ధ్రువీకరణ పత్రం పొంది పోటీ చేసారని పిర్యాదు చేసారు.దీంతో పంచాయతీ రాజ్ డైరెక్టర్ దీనిపై విచారణ చేసి నివేదిక అందించాలని డీపీవో ని ఆదేశించారు.ఆయన ఆదేశాలతో తొలుత 23.11.2024 న విచారణ కు ఆదేశించారు. అనివార్య కారణం చేత ఆరోజు విచారణ వాయిదా పడింది.మరల విచారణ 29.11.2024 ఉదయం 11గంటలకు విచారణ నిర్వహిస్తున్నామని తగిన బందోబస్త్ ఏర్పాటు చేయాలని ఎస్.ఐ.కె శ్రీనివాస్‌కి తెలియపరచమని ఈవో పీ ఆర్డీ తెలిపారు.

## కార్యకర్తకు అండగా చిలకలపూడి ఆర్థిక సాయం



**కోడూరు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని దింటిమెరక గ్రామానికి చెందిన జనసేన నాయకుడు లంకే రవి భార్య అనారోగ్యంతో విజయవాడ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్, డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు ఆమెను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం వైద్యులతో మాట్లాడి పూర్తిస్థాయిలో వైద్య సదుపాయాలు అందజేయాలని కోరారు. వైద్య ఖర్చులు నిమిత్తం 10,000 ఆర్థిక సహాయాన్ని లంకె రవికి అందించారు. ఆయన వెంట అంద్రాజు శ్రీనివాసరావు ఉన్నారు.

## శంకర్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



**ఏ.కొండూరు, నవంబర్ 28. మేజర్ న్యూస్:** మండలంలోని చీమలపాడు తెలుగుదేశం గ్రామ పార్టీ అధ్యక్షులు బెజవాడ శంకర్ తండ్రి బెజవాడ తాతయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వీరి కుటుంబాన్ని గురువారం తిరువూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు సందర్శించి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శంకర్ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు గద్దే కృష్ణారెడ్డి, టిడిపి నాయకులు జె కిషోర్, ఎం రామారావు, ఎం జమలయ్య,షేక్ కరీముల్లా, షేక్ ఆదాం షరీఫ్, బి పూర్ణచంద్రరావు, బి గోపిరాజు, బి సాంబశివరావు పలువురు పాల్గొన్నారు.

# ప్రగతిపథంలో కేడీసీసీ బ్యాంకు



## వరుసగా పదేళ్ల నుంచి జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం

### కేంద్ర హోం మంత్రి అమిత్ షా నుంచి అవార్డు అందుకున్న చైర్ పర్సన్, జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, సీఈవో శ్యాం మనోహర్

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రగతి పథంలో పయనిస్తోంది. జాతీయ స్థాయిలో గత పది ఏళ్లుగా ఉత్తమ బ్యాంకుగా ముందు వరుసలో కేడీసీసీ బ్యాంకు నిలుస్తోంది. దేశ వ్యాప్తంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు 360 ఉన్నాయి. జాతీయ స్థాయిలో ఈ బ్యాంకులన్నిటిలో బ్యాంకింగ్ సేవలకు సంబంధించి అన్ని రంగాల్లో బెస్ట్ పెర్ఫార్మెన్స్ లో ఈ ఏడాది కూడా ద్వితీయ స్థానం లభించింది. ఈనెల 26 వ తేదీన న్యూఢిల్లీలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేతుల మీదుగా ఉత్తమ అవార్డును బ్యాంకు చైర్ పర్సన్, జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, సీఈవో శ్యాం మనోహర్ లు అందుకున్నారు. భారతదేశంలో రెండో స్థానం లభించడం కృష్ణాజిల్లా గర్వించదగ్గ విషయమని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈఓ శ్యామ్ మనోహర్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అధికారులు, ఉద్యోగులు, వ్యవసాయ సహకార సంఘాల ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధికి బాటలు వేస్తున్నారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందేలా ఉద్యోగులకు దిశా నిర్దేశం చేయడంతో పాటు, ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ నిరంతరం కృషి చేస్తున్నారు.

దీంతో వాణిజ్య బ్యాంకులు సేవల కన్నా కృష్ణాజిల్లా కేంద్ర సహకార బ్యాంకు సేవలు మెరుగ్గా ఉండటంతో ఖాతాదారులు డిపాజిట్లు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. సీఈఓ శ్యాం కుమార్ నాయకత్వంలో అత్యున్నతమైన ప్రతిభ కనబరిచినందుకు రెండుసార్లు జాతీయ స్థాయిలో ఉత్తమ బ్యాంకు అవార్డులు అందుకున్నారు. బ్యాంకు రుణాల్లో 70 శాతం వ్యవసాయ రంగానికి అందిస్తోంది మిగిలిన 30 శాతం చేతి వృత్తులు, చిరు వ్యాపారాలు చేసుకునే వారితోపాటు రైతు కుటుంబంలోని వారికి ఉన్నత చదువులు కోసం విద్యా రుణాలు కూడా అందిస్తోంది.

కృష్ణాజిల్లా కేంద్ర సహకార బ్యాంకు కింద ఉమ్మడి జిల్లాలో 57 బ్యాంకు శాఖలు, 525 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. బ్యాంకులో 5 లక్షల పైబడి ఖాతాదారులు ఉన్నారు. బ్యాంకు టర్నోవర్ రూ.11,800 కోట్లు ఉంటే డిపాజిట్లు రూ.3,200 కోట్లు ఉన్నాయి. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక రుణాలు కింద రూ.8 వేల కోట్లు అందజేస్తోంది. బ్యాంకు రుణాలు రికవరీ శాతం కూడా సంతృప్తికరంగా ఉంది. అన్ని రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడం ఫలితంగా జాతీయ స్థాయిలో ఉత్తమ బ్యాంకుగా అరుదైన గౌరవాన్ని కృష్ణాజిల్లా కేంద్ర సహకార బ్యాంకు అందుకోవడం జిల్లా రైతాంగానికి ఎంతో గర్వకారణంగా ఉంది.



# పూలే ఆశయ సాధనకు కృషి చేద్దాం

## ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

**నందిగామ, నవంబర్ 28, మేజర్ న్యూస్ :** భారత ప్రథమ సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు, సంఘ సేవకుడు మహాత్మా జ్యోతిరావుపూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా కాకాని నగర్ కార్యాలయంలో స్థానిక నేతలతో కలిసి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ క్రమంలో మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి మహాత్మా జ్యోతిరావు పూలే చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. సమ సమాజ స్థాపనకు,బడుగ,బలహీన వర్గాలకు విద్యను అందిస్తూ అన్నిట్లో సమాన హక్కుల కోసం పోరాడిన పూలే ఆశయ సాధనలో అందరం నడుద్దామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న టిడిపి నాయ కులు, బీసీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మ జ్యోతిరావు పూలేకి నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్



**మచిలీపట్నం, మేజర్ న్యూస్ :** జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా గురువారం కలెక్టరేట్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల సముద్ధరణకు ఆయన చూపిన మార్గం అనుసరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కె. చంద్రశేఖర రావు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారత అధికారి జి రమేష్ సూపర్నెంట్ అనంతలక్ష్మి, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# ముడా చైర్మన్‌కు అభినందనలు తెలిపిన గురుమూర్తి



**పామర్రు నవంబర్ 28 మేజర్ న్యూస్:** మచిలీపట్నం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ మట్ట ప్రసాద్ ప్రమాణస్వీకరణ కార్యక్రమానికి కొనకళ్ళ బుల్లయ్య, మచిలీపట్నం తెలుగుదేశం పార్టీ కార్యాలయ కార్యదర్శి బత్తిన దాసు లతో కలిసి ఆంధ్రప్రదేశ్ గౌడ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన మట్ట ప్రసాద్ ను శాలువాతో సత్కరించి అభినందించారు. చేపట్టిన పదవికి మరింత వన్నె తేవాలని ప్రసాద్ కు సూచించారు.

# సోషల్ మీడియా సైకోలపై ఉక్కుపాదం

## రాష్ట్రవ్యాప్త అరెస్టులతో తగ్గిన అలజడులు

### శాంతించిన తెలుగు తమ్ముళ్లు

**విజయవాడ, మేజర్ న్యూస్:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఆరు నెలలు అవుతోంది. అధికారంలోకి వచ్చిన వెంటనే కార్యకర్తల మనోభావాల ప్రకారం పాలన ఉంటుందని, ఆ పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులు ఆశించారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తమను, తమ అధినేతను వేధించిన వారిపై కూటమి ప్రభుత్వం తీవ్ర చర్యలు తీసు కుంటుందని వారు భావించారు. అయితే ప్రభుత్వాధినేత చంద్రబాబు మాత్రం కక్షపూరిత రాజకీయాలు చేయనంటూ పాలనపై దృష్టిసారించారు. దీంతో.. టిడిపి కార్య కర్తలు, నాయకులు, సానుభూతిపరులు టిడిపి అధినేతపై తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేశారు. తాము అధికారంలో ఉన్నా..ఇంకా వైకా పా నాయకులు, వారి సానుభూతి పరులే పెత్తనం చేస్తున్నారని, ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా వారిదే హవా నడుస్తోందంటూ నిరసన స్వరాలను వినిపించారు. అయితే చంద్రబాబు వారిని పట్టిం చుకోకుండా తన మానాన తాను పనిచేసుకుంటూ వెళ్లారు. దీంతో వైకాపా కార్యకర్తలు, ఆ పార్టీకి చెందిన సోషల్‌మీడియా కార్యకర్తలు కూటమి ప్రభుత్వంపై విషం చిమ్మడం మొదలుపెట్టారు. అంతటితో ఆగకుండా డిప్యూటీ చీఫ్ మినిస్టర్, పంచాయితీరాజ్ మంత్రి పవన్‌కళ్యాణ్‌ను ఆయన కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని బూతులు తిట్టడంతో.. హోంమంత్రి అనిత శాంతి భద్రతల విషయంలోనూ, సోషల్ మీడియాలో బూతులు తిట్టేవారిని కట్టడి చేయలేదంటూ పవన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ప్రభుత్వ పెద్దల్లో ఒక్కసారిగా కదలిక వచ్చేంది. సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెట్టిన వారిపై కేసులు నమోదుచేయాలని, గతంలో.. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, లోకేష్‌లను దూషించిన వారిపై కూడా కేసులు పెట్టాలని పోలీసులకు ఆదేశాలు ఇచ్చారు.

**సోషల్ మీడియా సైకోల అరెస్టు సమయంలో కర్నూల్ రేంజ్ డీఐజీ స్పందన**

ఇటీవల సోషల్ మీడియాలో మహిళల పట్ల అత్యంత జుగుప్సాకరంగా పోస్టులు పెట్టిన నిందితులను అరెస్టు చేసిన విషయం తెలిసిందే,ఈ సందర్భంగా కర్నూల్ రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ మాట్లాడుతూ... ప్రభుత్వాలపరంగా.. వ్యక్తిగతంగా కాని సమాజంలో వాళ్ళు పెట్టిన పోస్టులను చదవలేక కడుపుకు అన్నం తినే వాళ్ళు ఇలాంటి పోస్టులు పెట్టారంటూ.. పూర్వం యాగలలో జంతువుల రక్తం పోసే రాక్షస జాతితో పోలుస్తూ... డీఐజీ మాట్లాడిన మాటలు సామాన్య ప్రజలతో పాటు చదువురాని వారికి సైతం ఆ రాతలను తెలుసుకోవాలనే కుతూహలం కలిగించింది... అందులో సభ్య సమాజంలో ఆడవారి పట్ల వారు వాడిన అసభ్య పదజాలం గ్రహించిన రాష్ట్ర ప్రజానీకంతో పాటు ప్రతిపక్షాలు సైతం నోరు మెదపలేదు అంటే వీరి వికృత రాతలు ఎంత ఘోరంగా ఉన్నాయో తెలుస్తోంది

**ఎక్కడకక్కడ కేసులు... అరెస్టులతో...!**

**- శ్రీ రెడ్డి క్షమాపణ లేఖ - బాబు,లోకేష్ మంచివారే అంటున్న పోసాని**

జరుగుతున్న పరిణామాల దృష్ట్యా శ్రీ రెడ్డి తనను ఈ ఒక్కసారికి క్షమించాలని లోకేష్ కు లేఖ రాశారు మరోవైపు పోసాని కృష్ణ మురళి చంద్రబాబు లోకేష్ మంచివారే నంటూ ప్రెస్ మీట్ లు పెట్టి మరి యూటర్న్ తీసుకుంటున్నాడు. ఇంకోవైపు రాష్ట్ర వ్యాప్తంగా వైకాపాకు చెందిన సీనియర్ నాయకులు, ఛోటా నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియాలో రెచ్చిపోయిన వారిపై కేసులు నమోదు అవుతున్నాయి. టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలు, నాయకులు తమపై తమ అధినేతపై అసభ్యదూషణలు చేసిన వైకాపాకు చెందిన వారిపై రాష్ట్ర వ్యాప్తంగా కేసులు నమోదు చేయిస్తున్నారు. దీంతో.. వైకాపా సోషల్ మీడియా కకావికలం అయింది. మహిళలను అసభ్యంగా దూషించిన సోషల్‌సైకో వర్రారవీంద్రారెడ్డి, బోరుగడ్డ అనిల్ మరికొందమందిని అరెస్టు చేయడంతో... రాష్ట్ర వ్యాప్తంగా దీనిపై చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో మాట్లాడే స్వేచ్ఛ లేదంటూ వైకాపా అధినేత జగన్ మొత్తుకుంటున్నా.. ఆయన స్వరాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. సినీనటులు పోసాని కృష్ణమురళీ, శ్రీరెడ్డి, రాంగోపాల్‌వర్మ వంటివారిపై టిడిపి నేతలు ఎక్కడకక్కడ కేసులు పెడుతున్నారు. కేవలం కేసులే కాకుండా వారి అరెస్టు కోసం నోటీసులు ఇస్తున్నారు. దీంతో.. టిడిపి కార్యకర్తల్లో, నాయకుల్లో కొంచెం సంతోషం వ్యక్తం అవుతోంది. అయితే..తాము ప్రతిపక్షంలో ఉండగా తమ అధినేతను, ఆయన భార్యను దూషించిన అంబటి రాంబాబును, కొడాలినాని, వల్లభనేని వంశీ, అనిల్‌కుమార్ యాదవ్, ద్వారంపూడి చంద్రశేఖర్ వంటి బడానేతలను అరెస్టు చేయాలని, అప్పుడే.. సోషల్ సైకోలకు బుద్ధి వస్తుందనే భావన టిడిపి, జనసేనలో ఉంది. కాగా ఇప్పటి వరకూ వారిపై తీసుకున్న చర్యలపై కొంత సంతృప్తి వ్యక్తం అవుతున్నా.. పేరుమోసిన నేతలను అరెస్టు చేస్తే.. వారిలో పూర్తిస్థాయి సంతోషం కనిపిస్తుందన్న చర్చ పార్టీలోనూ, సానుభూతిపరుల్లోనూ జరుగుతోంది.



కరీ శ్రీనివాసరావు
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్



# సాయిబాబా ఆలయంలో 50 వారాలుగా అన్న సమారాధన

**కృత్తివెన్ను నవంబర్ 28 మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని లక్ష్మీపురం లాకు సెంటర్లో వేంచేసి ఉన్న శ్రీ శిరిడి సాయిబాబా ఆలయంలో భక్తులకు గురువారం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. జాతీయ రహదారి సమీపంలో ఉన్న బాబా ఆలయంలో ప్రతి గురువారం దాతల సహకారంతో సుమారు 50 వారాలుగా అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ అందే రామాంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా లక్ష్మీపురం తెలుగుదేశం పార్టీ నాయకులు పులగం రామానుజరావు సీతామహాలక్ష్మి దంపతుల కుమార్తె అయిన ప్రణవి పుట్టిన రోజు సందర్భంగా అన్న సమారాధన కార్యక్రమాన్ని భారీగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పిన్నెంటి రత్తయ్య షిరిడి సాయిబాబాను దర్శించుకున్నారు. మొదటిసారిగా ఆలయానికి విచ్చేసిన సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు రత్తయ్యను ఘనంగా సత్కరించారు. ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు.భక్తులు పెద్ద ఎత్తున బాబాను దర్శించుకుని, అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కొప్పర్తి రంగారావు, శ్యామలస్టూడియో బుజ్జి, కొప్పర్తి ఏసు, మణికంత, రాంబాబు, సాయి, శివకృష్ణ, సత్తిబాబు, భక్తులు మహిళా సేవా కమిటీవారు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## మత్స్యకారుల ప్రతినిధికి రాజ్యసభ సభ్యత్వం కల్పించాలి



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** రానున్న రాజ్యసభ ఎన్నికలలో మత్స్యకారుల ప్రతినిధికి రాజ్యసభ సభ్యత్వం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ సాంప్రదాయ మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయు లు ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్‌లకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన అవనిగడ్డలో విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ దీర్ఘకాలం నుంచి పార్ల మెంటులో అపరిష్కృతంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మత్స్య కారుల సమస్యలు పరిష్కరించుకోవడానికి వీలుగా మత్స్యకారుల ప్రతినిధిని ఒక స్థానానికి ఎంపిక చెయ్యాలని లకనం కోరారు.రాష్ట్రంలో నలభై లక్షల మంది మత్స్యకారులు ఉండగా ఒక్కరికి కూడ పార్లమెంటులో గాని, రాజ్యసభలో గాని సభ్యత్వం లేకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు

## మైలవరంలో ఘనంగా జ్యోతిరావు పూలే వర్ధంతి



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** పట్టణంలో మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా మైలవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జ్యోతి రావు పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన మైలవరం తెదే పా శ్రేణులుఅణగారిన వర్గాల అభ్యున్నతి వారి విద్యాభివృద్ధికి మహిళో ద్ధరణ కు కృషి చేసిన ప్రముఖ సంఘ సంస్కర్త సామాజిక తత్వవేత్త, కుల వివక్షకు వ్యతిరేకంగా నాలుగు దశాబ్దాల పాటు సామాజిక ఉద్యమం నడిపి న మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఆయన సేవలను స్మరిం చుకుంటూ మహనీయుని స్మృతికి ఘన నివాళులుఈ కార్యక్రమంలో మైల వరం పట్టణ తెదేపా నాయకులు కార్యకర్తలు తెలుగు యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గుత్తికొండ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం



**ఘంటసాల, మేజర్ న్యూస్:** గుత్తికొండ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని సర్పంచ్ రాజులు ప్రసాద్ గౌడ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని తెలుగు రావుపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదురుగా వెల్నెస్ సెంటర్ కొరకు తీసిన పునాదులు నీరు వచ్చి చెరువు లాగా తయారైనది చాలా లోతుగా ఉండటం వలన ప్రజలు ఏ విధమైన సమస్యలు రాకుండా గ్రామస్తులు తెలియజేసిన వెంటనే వెల్నెస్ సెంటర్ కొరకు తీసిన గొయ్యిను పూడ్చివేసిన గుత్తికొండ అధినేతలు గుత్తికొండ కళ్యాణ్, గుత్తికొండ రవి బాబు గ్రామ సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు పంచాయతీ తరపున గ్రామస్తులు తరపున కృతజ్ఞతలు తెలిపారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** ముఖ్య మంత్రి సహాయనిధి నుంచి ఐదుగురు లబ్ధిదారులకు ఆర్థిక సాయం మంజూ రయ్యాయి. ఆ చెక్కులను గురువారం నాడు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు రామినేని రాజశేఖర్ (రాజా) ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. తుమ్మలపాలెం గ్రామానికి, చెందిన సోడి మౌనిక కి రూ.41,500 వేలు, రొంపిచర్ల సుబ్బారావు కు రూ.25,524 వేలు, జూపూడి గ్రామానికి చెందిన ఉండవల్లి పరసయ్య కు రూ.2,00,083 వేలు, కాచవరం గ్రామానికి చెందిన మదల నరసింహారావు కు రూ.1,67,845 వేలు కోటికలపూడి గ్రామానికి చెందిన ఏద్దూరి సంపూర్ణమ్మకి రూ.1,87,375 వేలు సీఎం సహాయ నిధి నుండి మంజూర య్యాయి. లబ్ధిదారులకు కష్టం వచ్చినా వెంటనే స్థానిక శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్ దృష్టికి రామినేని రాజా తీసుకువెళ్లగా ఆయన వెంటనే స్పందించి సీఎం సహాయనిధికి సిఫార్సు చేశారు.ఆర్థిక సాయం అందడంతో లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.చెక్కులతో పాటు ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు పంపిన లేఖలను కూడా లబ్ధిదారుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జూపూడి గ్రామ పార్టీ అధ్యక్షుడు కోటికలపూడి గ్రామ పార్టీ అధ్యక్షులు పల్లె శ్రీనివాస్, చిలుకూరు గ్రామ పార్టీ అధ్యక్షులు సుబ్బారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు అవిటి రాజేశ్వరరావు,గొరనేని పిచ్చేశ్వరరావు, బొంత గంగరాజు, నరసింహస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న బీసీ సంఘాలను నిర్మూలిస్తాం





**నూతన కమిటీలతో బీసీల సమస్యల పరిష్కార దిశగా ముందుకు వెళ్తాం**

**జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ బోను దుర్గా నరేష్**

**విజయవాడ మేజర్ న్యూస్ :** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా బీసీ సంక్షేమ సం ఘం కోసం పనిచేసే వారికి పదవులు ఇచ్చి పాత కమిటీలు ప్రక్షాళన చేస్తా మని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్, ఇన్చార్జి బోను దుర్గా నరేష్ తెలిపారు. గన్నవరం, ఏలూరు,పాలకొల్లు,రాజమండ్రి,ఉమ్మడి కృష్ణ, నెల్లూరు జిల్లాలతో పాటు ఇతర జిల్లాలకు కమిటీలు వేస్తున్నామని, కొత్తగా నియమించిన వారికి నియామక పత్రాలు అందచేస్తున్నమని చెప్పారు. పుట్టగొ డుగుల్లా పుట్టుకొస్తున్న బీసీ సంఘాలను నిర్మూలిస్తామని ఆయన స్పష్టం చేశారు. విజయవాడ గాంధీనగర్ లోని ప్రెస్ క్లబ్ లో గురువారం మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి బీసీ సంక్షేమ సంఘం నేతలతో కలిసి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో జాతీ య బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ బోను దుర్గా నరేష్ మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘాలు అనేకం పుట్టుకొస్తున్నాయని బీసీలు ఎవరిని నమ్మాలో తెలియని పరిస్థితి వస్తుందన్నారు. ముందుగా వాటి ప్రక్షాళన జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.. అదేవిధంగా గన్నవరం, ఏలూరు, పాలకొల్లు, రాజ మండ్రి, ఉమ్మడి కృష్ణ, ప్రకాశం, ఉమ్మడి నెల్లూరు జిల్లాల వైపు నూతన కమి టీలు వేస్తున్నామని, కొత్తగా నియమించిన వారికి నియామక పత్రాలు అంద చేస్తున్నామని చెప్పారు. నూతన కమిటీలతో బీసీల సమస్యల పరిష్కార దిశగా ముందుకు వెళ్తామన్నారు. ఏ కార్యక్రమం చేసిన అందరూ కలిసి చేసుకుంటా మని, బీసీలకి రావలసిన హక్కులపై పోరాడతామని అన్నారు. ప్రభుత్వం దృష్టి కి వాటిని తీసుకువెళ్లి పరిష్కారం చేసుకుంటామన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాలు చేసి సంఘాన్ని బలోపేతం చేస్తామన్నారు. బీసీ కులగుణన,రిజర్వేషన్ లపై పోరాడతమని చెప్పారు. అనంతరం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నూకలమ్మ మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘం అంటే నీతి నిజాయితికి మారుపేరని, కొన్ని దశాబ్దాలుగా ఆర్.కృష్ణ య్య బీసీల సమస్యలపై పోరాడుతున్నరని చెప్పారు. తన కోసం కాకుండా బీసీల కోసం కష్టపడుతున్నారని అన్నారు.బీసీ సంక్షేమ సంఘం ఏర్పాటు చేసి చట్టసభల్లో బీసీలను కూర్చోబెట్టారని,బీసీ లు అందరూ ఈ విషయాన్ని గమ నించాలన్నారు. మంచి చేసినంత కాలం టీడీపీ,,తరువాత రాజ్యసభ సభ్యులు గా వైసిపిలో ఉండి బీసీల కోసం ఆర్ కృష్ణయ్య. పోరాడారని,అగ్రకులాలు ఇ ప్పుడు కృష్ణయ్య నీ విమర్శించటం తగదన్నారు. పార్టీలు,పదవులు ముఖ్యం కా దు, బీసీలకు న్యాయం చేసే వారి వైపే కృష్ణయ్య ఉన్నారని, మంచి జరుగు తుందన్న ఉద్దేశంతో కూటమికి మద్దతు ఇద్దామని అనుకుంటున్నారని చెప్పా రు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు చింతా శ్రీను, ఏలూరు జిల్లా ఇన్చార్జి భీమవరపు హేమ, కృష్ణాజిల్లా అధ్యక్షులు రంగు విక్ర మ్, విజయవాడ నగర అధ్యక్షులు కిరణ్, మెండెంజ్యోతి, శారదా పాల్గొన్నారు.

# వైభవంగా అయ్యప్ప స్వామి వారి అభిషేకం, ఆరట్టు ఉత్సవములు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్:** అయ్యప్ప మాల దారులు వివిధ వేషధారణలతో అవనిగడ్డ ప్రధాన వీధులలో నిర్వహించిన పేటతుల్లి కార్యక్రమం ఆకట్టుకుంది. స్థానిక వ్యాపారి కూరాళ్ల ఆదినారాయణ కుమారుడు బద్రి నారాయణ స్వామి 18 వ యేట శబరిమల యాత్రణ పురస్కరించుకుని గురువారం డి ఎస్పి రోడ్లో ఏర్పాటుచేసిన అయ్యప్ప స్వామి 18 మెట్ల మండపం దివ్య అలంకరణతో వెలిగిపోతుంది. ఈ సందర్భంగా గణపతి హోమం, స్వామి వారికి నవ విధ అభిషేకాలు నిర్వహించి చందనం తో పట్టు వేసి ఆరట్టు ఉత్సవం నిర్వహించారు.తిరుపతి కి చెందిన చంద్ర మౌళి గురు స్వామి ఆధ్వర్యంలో కోడూరు అయ్యప్ప స్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు కొమ్మూరి శ్రీను శిష్య బృందం నేతృత్వం లో స్వామి వారికి ప్రత్యేక పూజలు, గణపతి హోమం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడం తో స్వామి వారికి కనకాభిషేకం చేసారు. అయ్యప్ప స్వాములు 18 వ యాత్ర పురస్కరించుకొని శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి వారి దేవస్థానం ఆవరణలో కొబ్బరి మొక్క నాటారు. అనంతరం చందనం పట్టు లో వున్నా స్వామి వారిని తల పై పెట్టుకుని అయ్యప్ప స్వామి శరణు ఘోష చెప్పుకుం టూ పురవీధులలో ఊరేగింపు నిర్వహించారు. కోయ వేషాలు, వివిధ ఆకృతులలో వేషధారణ చేసుకుని కొత్తపేట కృష్ణా నది వరకు పేటతుల్లి ఆడుతూ ఆరట్టు ఉత్సవం నిర్వహించారు. చందనం పట్టు తో స్వామి వారిని కృష్ణా నది లో పుణ్య స్నానాలు ఆచరించి శరణు ఘోష చెప్పుకుంటూ స్వగృహానికి తిరిగి రాగ మాల ధరించిన స్వాముల స్వామియే శరణం అయ్యప్ప అనే శరణు ఘోషతో పురవీధులు పులకించాయి.

# రైతులెవరు ఆందోళన పడనవసరం లేదు..

## సమస్యలు పరిష్కరిస్తూ..రైతులకు అండగా కూటమి ప్రభుత్వం ఉంది



**నందివాడ,మేజర్ న్యూస్:** గుడివాడ, పామర్రు నియోజకవర్గాల్లో రోడ్లపై ఆరబోసిన ధాన్యపురాసులను గురువారం పరిశీలించిన పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్. రైతులతో మాట్లాడుతూ.. ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ జరుగుతుందంటూ భరోసా ఇచ్చారు. గుడివాడ, పామర్రు ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, వర్ల కుమార్ రాజాతో కలిసి.. గుడివాడలో వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశమైన మంత్రి మనో హర్. గుడివాడలో ఎమ్మెల్యేలు రాము, వర్ల కుమార్ రాజాతో కలిసి మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మీడియాతో మాట్లాడుతూ వాతావరణ మార్పులతో 40 రోజుల పాటు జరగాల్సిన ప్రక్రియ నాలుగు రోజుల్లో చేయాల్సి వస్తుందన్నారు. రైతు లకు మద్దతుగా అధికార యంత్రాంగమంతా రాత్రి పగళ్లు కష్టపడుతుం దన్నారు. వాతావరణ మార్పులతో రైతులకు మేలు చేకూర్చేలా ధాన్యం విక్రయాల్లో అనేక సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. ధాన్యం విక్రయాలపై క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతులకు భరోసా కల్పిస్తున్నామన్నారు. రైతులకు నమ్మకం కలిగించేలా ధాన్యం కొనుగోల్లో ఇబ్బందులు లేకుండా ముందుకు వెళ్ళమని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. గతంలో ఎన్న డూ లేని విధంగా ధాన్యం విక్రయించిన 24 గంటల్లో రైతుల ఖాతల్లో నగదు జమ చేస్తున్నామన్నారు. 24 తేమ శాతం ఉన్నా ధాన్యం కొనుగోళ్లు చేసేలా మిల్లర్లకు ఖచ్చితమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. రైతుల ఆందోళన గుడివాడ ఎమ్మెల్యే రాము విజ్ఞప్తిని దృష్టిలో ఉంచుకొని.. సాయంత్రానికల్లా గుడివాడలో 30 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. మిల్లర్లకు బ్యాంకు గ్యారంటీ ఇబ్బందులు తలెత్తకుండా బకాయి నిధులు విడుదల చేశామన్నారు. కొత్త ఆలోచనతో 1:2 నిష్పత్తిలో రైతులకు బ్యాంక్ గ్యారంటీ వెసులుబాటు కల్పించామన్నారు. రైతు భరోసా కేంద్రాలను సంప్రదిస్తే.. కల్లాల వద్దకే గోనెసంచెలు.. రవాణా వాహనాలను పంపించేలా ఏర్పాటు చేశామన్నారు. రైతులెవరు దళారులను ప్రోత్సహించవద్దు రైతులకు మద్దతుగా ఎమ్మెల్యే రాము కూటమి ప్రజాప్రతిని అందరూ సహాయంగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ పిన్నమనేని బాబ్జి, కూటమి పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన పోలీస్ యాన్యువల్ స్పోర్ట్స్ & గేమ్స్ మీట్ -2024



విజయవాడ క్రైం, మేజర్ న్యూస్: ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ యాన్యువల్ స్పోర్ట్స్ & గేమ్స్ మీట్-2024 వేడుకలలను ఉత్సాహవంతమైన, ఆహ్లాదకర వాతావరణంలో గురువారం సిటీ ఆర్మ్డ్ రిజర్వ్ గ్రౌండ్లో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ముఖ్య అతిధిగా విచ్చేసి లాంచనంగా ప్రారంభించారు. ది. 28.11.2024వ తేదీ నుండి ది.30.11.2024వ తేదీ వరకు (మూడు రోజుల పాటు) జరిగే పోలీస్ యాన్యువల్ స్పోర్ట్స్ & గేమ్స్ మీట్-2024లో ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ కమీషనరేట్ పరిదిలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది ఏడు జోన్లు (1) క్రైమ్ అండ్ సి. ఎస్.బి. జోన్ (2) ఈస్ట్ జోన్, (3) ట్రాఫిక్ జోన్, (4) వెస్ట్ జోన్, (5) సి.ఏ.ఆర్, & సి.ఎస్.డబ్ల్యూ జోన్, (6) రూరల్ జోన్, (7) సి.పి. ఒ. స్టాఫ్గా ఏర్పడి పాల్గొనే ఈ క్రీడల్లో కబడ్డీ, వాలీబాల్, టగఫ్ వార్, హ్యాండ్ బాల్, బాస్కెట్బాల్, త్రోబాల్, డిస్కస్ త్రో, షార్ట్ పుట్, షటిల్ బాట్మింటన్, రన్నింగ్ 100 మీటర్స్, 200 మీటర్స్, 400 మీటర్స్, 800 మీటర్స్, 1500 మీటర్స్, 4ఐ100 మీటర్స్ రిలే, 4ఐ400 మీటర్స్ రిలే తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ముందుగా ప్రారంభోత్సవ కార్యక్రమం సందర్భంగా పోలీస్ యాన్యువల్ స్పోర్ట్స్ & గేమ్స్ మీట్లో పాల్గొనే పోలీస్ సిబ్బంది, అధికారుల నుండి నగర పోలీస్ కమీషనర్ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం క్రీడల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేసినారు. అధికారులు శుభసూచికగా పావురాలు, బెలూన్లను గాల్లోకి వదిలారు. అనంతరం












ప్రారంభ చిహ్నం క్రీడా జ్యోతిని పోలీస్ కమీషనర్ వెలిగించగా జిల్లా స్థాయి నుండి రాష్ట్ర, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరచి పతకాలు సాధించిన పోలీస్ క్రీడాకారులు వి.శ్రీనివాసరావు, (ఆర్.ఐ. సి.ఎస్.డబ్ల్యూ), ఎం. తులసి చైతన్య (హెచ్.సి-2410), డి.నరేష్ బాబు (హెచ్.సి-2146) శ్రీనివాస్ నాయక్, (ఏ.ఆర్. హెచ్.సి-433), జి.సాబశివరావు, (ఏ.ఆర్. హెచ్.సి-306) కె. లక్ష్మి ప్రసన్న (పి.సి.3240) లు క్రీడా జ్యోతి చేతబూని పరుగు మొదలు పెట్టారు. ఈ కార్యక్రమంలో డి.సి.పి.లు తిరుమలేశ్వర రెడ్డి, ఉమామహేశ్వర రాజు, ఎ.బీ.టి.ఎస్.ఉదయరాణి, కృష్ణమూర్తి, ఎస్.వి.డి.ప్రసాద్, జి.ఆనంద్ బాబు క్రీడా స్ఫూర్తితో వ్యవహరించి రెట్టింపు ఉత్సాహంతో ఈ క్రీడల్లో పాల్గొని ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా నగర పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ........ నిత్యం పని ఒత్తిడి తో పోలీసులు బిజీగా ఉంటారు, 2024 లో పోలీసు శాఖ చాలా పని ఒత్తిడి కి గురైన మాట వాస్తవం, ప్రజల్లో మన పై అంచనాలు రోజు రోజుకు పెరుగుతున్నాయి, ఎప్పటికప్పుడు పరిస్థితులు కు అనుగుణంగా పని తీరులో మార్పులు చేస్తున్నాం, ఇప్పుడు సాంకేతికత ఆధారంగా కేసులు ను చేధిస్తున్నాం, చాలా కేసులలో ఈ సాంకేతిక పరిజ్ఞానం ప్రధానంగా మారింది, శారీరక, మానసిక శ్రమ ఒత్తిడి పోలీసు పై ఉంటుంది, ప్రతిరోజూ వ్యాయామం చేస్తున్నా... క్రీడలు మరింత ఉత్సాహాన్ని ఇస్తాయి, పోలీసు శాఖలో ఫిజికల్ ఫిటనెస్ ఎంతో అవసరం, వ్యాయామం, క్రీడలు... పోలీసుల్లో మరింత ఉత్తేజాన్ని నింపుతాయి, క్రీడలతో మనకి తెలియకుండానే మనసికంగా ధృడత్వాన్ని పొందుతాం, మా వంతుగా పోలీసులు క్రీడల్లో రాణించేలా ప్రోత్సహిస్తాం, ప్రజల సంరక్షణ అనేది పోలీసులు కు ప్రధమ కర్తవ్యం, మాకు పోలీసులు ఆరోగ్యం కూడా చాలా ముఖ్యం, మహిళా పోలీసులు కూడా ఎక్కువమంది క్రీడల్లో పాల్గొంటున్నారు, విధుల్లో కూడా చాలా చురుకుగా మహిళా పోలీసులు పని చేస్తున్నారు, మూడు రోజుల పాటు జరిగే ఈ క్రీడల్లో అందరూ బాగా ఆడాలని ఆకాంక్షిస్తున్నా, ఏడు టీం లు... ఏడు అంశాలలో పోటి పడుతున్నారు. ఈనెల 30 వ తేదీన ముగింపు సభ నిర్వహిస్తాం, సమాజానికి పోలీసు శాఖ దిక్సూచిగా మారాలి, యువతని మంచి మార్గంలో నడిపేలా పోలీసులు బాధ్యత తీసుకోవాలి, త్వరలో యూత్ స్పోర్ట్స్ ను కూడా నిర్వహించే ఆలోచన చేస్తున్నాం,నేటి యువత క్రీడలు పూర్తిగా మరచి పోతుంది, వారికి క్రీడల వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తాం,మహిళలు కూడా ఇంటికే పరిమితం కాకుండా ఎంచుకున్న రంగంలో ఎదిగేలా ప్రోత్సహించాలి, క్రీడల ద్వారా మానసిక ఉత్సాహం తో విధుల్లో కూడా మంచి ఫలితాలు సాధిస్తారు అని తెలియజేసారు. ఈ యాన్యువల్ స్పోర్ట్స్ & గేమ్స్ మీట్ ను ఇంత ఘనంగా నిర్వహించడంలో క్రియాశీలక పాత్ర పోషించిన సి. ఎ. ఆర్. ఏ. సి. పి డి ప్రసాద రావుని, వారి సిబ్బందికి అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో డి.సి.పి.లు తిరుమలేశ్వర రెడ్డి, ఉమామహేశ్వర రాజు, ఎ.బీ.టి.ఎస్.ఉదయరాణి, కృష్ణమూర్తి, ఎస్.వి.డి.ప్రసాద్, జి.ఆనంద్ బాబు, ఏ.డి.సి.పి.లు, ఏ.సి.పి.లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




















# 12వ వార్డులో ఎన్‌పీసీఐ, ఇంటింటికి జియో ట్యాగింగ్







## స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న ప్రత్యేక అధికారి వసీం బేగ్

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ఇంటింటి సర్వే జియో ట్యాగింగ్ పురోగతికి సంబంధించి విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టిన ఎన్‌పిసిఐ నిష్క్రియాత్మక చర్యలు, సర్వే పనులు పూర్తిచేయలేదని గుర్తించి సర్వే పనులను పూర్తి చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్, కమీషనరు, వీఎంసీ నిర్వహించిన సమీక్షా సమావేశంలో టెలికాన్ఫరెన్స్ ద్వారా గృహాల సర్వే, ఎన్‌పిసిఐ ఇన్‌యాక్టివ్ అకౌంట్స్ యాక్షన్ తీసుకున్న సర్వే యొక్క జియో ట్యాగింగ్‌ను పూర్తి చేయాలని ఆదేశాలు జారీచేశారు. అందుపై వార్డు సెక్రటేరియట్‌లలోని వార్డు స్పెషల్ ఆఫీసర్లు, కార్యనిర్వాహకులందరూ ఉదయం 6 గంటలకు ఫీల్డ్‌కు హాజరై క్షేత్రస్థాయిలో సర్వేపనుల పురోగ తిని పరిశీలించి నివేదికను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు 2రోజు ల్లో అందజేయాలని, అంటే ఈనెల 28, 29 తేదీల్లోగా పనులు పూర్తి చేయాలని సూచించారు. కావున విజయవాడ నగర పాలక సంస్థ కమీషనరు ఆదేశానుసారం గురువారం స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో సచివాలయ సిబ్బందితో కలిసి ప్రత్యేక అధికారి వసీం బేగ్ 12వ వార్డులో ఎన్‌పీసీఐ, ఇంటింటికి జియో ట్యాగింగ్ కార్యక్రమానికి హాజరయి సేకరించిన వివరాల నివేదికను ఉన్నతాధికారులకు అందజేశారు. స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో కమిషనర్ సార్ ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బందితో కలిసి 12వ వార్డులో ఎన్‌పీసీఐ, ఇంటింటికి జియో ట్యాగింగ్ కార్యక్రమానికి ప్రత్యేక అధికారి వసీం బేగ్ హాజరయ్యారు.

# విజయవాడలో దేవకీ నందన వాసుదేవ చిత్ర యూనిట్ సందడి



**విజయవాడ, మేజర్ న్యూస్ :** విజయవాడలో దేవకీ నందన వాసుదేవ చిత్ర యూనిట్ సందడి చేసింది. తన చిత్రాన్ని విజయవంతం చేసిన అఖిలాంధ్ర ప్రేక్షకులకు హీరో అశోక్ గల్లా కృతజ్ఞతలు తెలియజేశారు. చిన్న చిత్రాన్ని ఆదరించిన ప్రేక్షకులకు రుణపడి ఉంటానని ఆయన పేర్కొన్నారు. సూపర్ స్టార్ మహేష్ బాబు మేనల్లుడు అశోక్ గల్లా నూతనంగా నటించిన దేవకీ నందన వాసుదేవ చిత్రం విజయవంతం కావడంతో చిత్రం యాత్రలో భాగంగా బెంజ్ సర్కిల్‌లోని ట్రెండ్ సెట్ మాల్ లో చిత్ర యూనిట్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా హీరో అశోక్ గల్లా మాట్లాడుతూ సెన్సేషనల్ హిట్ సాధించిన హనుమాన్ చిత్ర దర్శకుడు ప్రశాంత్ వర్మ అందించిన కథతో దర్శకుడు అర్జున్ జంధ్యాల నిర్మించిన దేవకీ నందన వాసుదేవ చిత్రం అఖిలాంధ్ర ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ చిత్రంలో థ్రిల్లర్ అంశాలు ప్రేక్షకులకు మధురానుభూతిని కలిగిస్తున్నాయని తెలిపారు. దేవకి నందన వాసుదేవ చిత్రానికి సంబంధించి తాము చేపట్టిన విజయ యాత్రకు ప్రేక్షకుల నుంచి విశేషమైన ఆదరణ లభిస్తోందన్నారు. తమ చిత్రానికి తెలుగు రాష్ట్రాల్లో కలెక్షన్స్ విపరీతంగా వస్తున్నాయని అన్నారు. ఈ చిత్రం విజయం తనపై ఎంతో భారం మోపిందని రానున్న చిత్రాలలో మంచి కథలను ఎంపిక చేసుకొని ప్రేక్షకులను అలరించేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని ఆయన పేర్కొన్నారు. అనంతరం దర్శకుడు అర్జున్ జంధ్యాల మాట్లాడుతూ దేవకీ నందన వాసుదేవ చిత్రాన్ని తెలుగు హిట్ చేసినందుకు ఆయన తెలుగు ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపేందుకు నేరుగా థియేటర్స్ కి వెళ్లి వారిని కలిసి తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నామన్నారు. అశోక్ గల్లా నటన చూసి ప్రతి ఒక్కరూ అద్భుతంగా ఉందని కొనియాడటం సంతోషంగా ఉందన్నారు. కాగా తొలుత గురునానక్ కాలనీలోని సూపర్ స్టార్ కృష్ణ విగ్రహానికి అశోక్ గల్లా పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం అభిమానులతో కలిసి బైక్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు.



# నిబంధనలకు అనుగుణంగా సాగునీటి సంఘాలకు ఎన్నికలు

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లాలో సాగునీటి సంఘాలకు ఎన్నికల ప్రక్రియ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. జిల్లా కలెక్టర్ గురువారం కలెక్టరేట్ నుంచి జిల్లాలోని ఆర్డీవోలు, తాసిల్దార్లు, ఇరిగేషన్ ఏఈ లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 204 సాగునీటి సంఘాలు, 27 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 2318 టెరిటోరియల్ కాన్స్టిట్యూఎన్సీస్, ఒక ప్రాజెక్టు కమిటీ ఉన్నాయని, వీటికి ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు ఓటర్ల జాబితా ఫైనలైజ్ చేసి ఒకటి రెండు కాపీలు ఎన్నికలు నిర్వహించే వెన్యూ వద్ద సిద్ధంగా ఉంచాలని, వెన్యూలు ఫైనలైజ్ చేయాలన్నారు. ఒక్కో సాగునీటి సంఘం పరిధిలో ఉన్న టెరిటోరియల్ కాన్స్టిట్యూఎన్సీలకు కలిపి ఒకే వెన్యూ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎన్నికల ప్రక్రియకు అవసరమైన మెటీరియల్ సేకరించి సిద్ధం చేసుకోవాలన్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం సాధ్యమైనంతవరకు ఏకగ్రీవం అయ్యేందుకు ఎన్నికల ప్రక్రియ నిబంధనలు ముందుగా శాసన సభ్యులకు, ప్రజాప్రతినిధులకు ముందుగా వివరించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన బందోబస్తు ఏర్పాటు పోలీస్ అధికారులు నిర్వహించాలన్నారు. తొలుత రాష్ట్ర జల వనరుల శాఖ కార్యదర్శి సాయి ప్రసాద్ జిల్లా కలెక్టర్లతో సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణ అంశంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కలెక్టరేట్ నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొని జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికల ఏర్పాట్లు వివరించారు. డిఆర్ఓ కె. చంద్రశేఖర రావు, కెఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, జల వనరుల శాఖ ఈఈ కే బాబు పాల్గొన్నారు.

## ఆకాశ దీపం ప్రజ్వలన చేసిన రిటైర్డ్ పోలీస్ ఎస్.పి. దంపతులు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కార్తీక మాసం నెల రోజులపాటు ప్రతిరోజూ ప్రాతః కాలం పరమేశ్వరునికి క్రమం తప్పకుండా వస్తున్న రిటైర్డ్ పోలీస్ సూపరింటెండెంట్ గూడూరి వెంకట సత్యనారాయణ మూర్తి, విశ్వ భారతి దంపతులు బుధవారం సాయంత్రం ఆకాశ దీపం ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆకాశ దీపం వెలిగించి తాడులాగారు. భక్తులు పెద్దఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రిటైర్డ్ పోలీస్ ఎస్.పి. దంపతుల ఆధ్వర్యంలో అయ్యప్ప భజన నిజాంపేట్ శ్రీ భ్రమరాంబా సమేత మల్లిఖార్జున స్వామి వారి ఆలయంలో బుధవారం రాత్రి రిటైర్డ్ పోలీస్ ఎస్.పి. గూడూరి వెంకట సత్యనారాయణ మూర్తి, విశ్వ భారతి దంపతుల ఆధ్వర్యంలో అయ్యప్ప భజన జరిగింది. ఈ దంపతులు అయ్యప్ప భక్తులకు ప్రసాద వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో వాకాడ రామకుమార్, అరుణ దంపతులు, సూర్యనారాయణ, సత్యనారాయణ, మహేష్, శంకర మల్లిఖార్జున శర్మ తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబర్ 15నాటికి ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల నూతన కమిటీల నిర్మాణం



**నందిగామ, మేజర్ న్యూస్ :** మహా జననేత మందా కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల నూతన కమిటీల నిర్మాణంలో భాగంగా ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల ఎన్టీఆర్ జిల్లా సమావేశం నందిగామలో జరిగింది. ముఖ్య అతిధిగా హాజరైన ఎంఆర్పీఎస్ రాష్ట్ర



ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల ఇన్చార్జ్ పేరెల్లి ఎలీషా మాదిగ మాట్లాడుతూ ఈ సమావేశ ముఖ్య ఉద్దేశం మందా కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు డిసెంబర్ 15వ తారీకు కల్లా జిల్లాలో ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్, ఎంఎంఎస్ అన్ని విభాగాల గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు క్షేత్రస్థాయిలో కమిటీలు నిర్మించడం కోసం అన్ని మండల, నియోజకవర్గ, జిల్లా ఇన్చార్జులను నియమించారు. ఈ సమావేశానికి ఎంఆర్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆదూరి నాగమల్లేశ్వరరావు మాదిగసభ అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ఎంఎస్పీ సీనియర్ నాయకులు కోటా డేనియల్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు మందా పిచ్చయ్య మాదిగ, మార్కపూడి రామారావు మాదిగ, ఇంజామురి విష్ణు మాదిగ, మందా యాకోబు, బుల్లాబ్బాయి, యద్దనపూడి ఏడుకొండలు, శరత్, కొండూరి సంగయ్య పాల్గొన్నారు.

## డిసెంబరు ఒకటి కాపు వన సమారాధన



**నందిగామ, నవంబర్ 28, మేజర్ న్యూస్:** డిసెంబరు ఒకటి నందిగామ శివారు పెద్ద బ్రిడ్జి వద్ద భద్రయ్య మామిడి తోటలో కాపు వన సమారాధన ఘనంగా నిర్వహించడానికి కాపు సంఘం నాయకులు ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి మాజీ శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్మోహనరావుని కాపు వన సమారాధన నిర్వాహకులు ఆహ్వానించారు. స్థానిక నందిగామ పట్టణంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నందిగామ మాజీ శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు ని కలిసి ఆహ్వాన పత్రికను నందిగామ నియోజకవర్గ కాపు నాయకులు పూజారి రాజేష్, కామిశెట్టి వెంకటేశ్వరరావు, తాటి వెంకటకృష్ణ, బుజ్జి బాబు అందజేశారు. అనంతరం వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కాపు నాయకులు పారుపల్లి హరిబాబు పాల్గొన్నారు.

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999